సాక్షి పశ్చిమగోదావరి

ఆదివారం । 3 । మార్చి । 2024



నిత్యాన్నదాన ట్రస్ట్‌కు విరాళం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్ట్‌కు మఠంగూడెంకు చెందిన జాస్తి మధు కేశవ కృష్ణ దంపతులు రూ.2,82,200 విరాళంగా శనివారం అందజేశారు.



త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని బీవీ ఆర్ కళా కేంద్రంలో శ్రీత్యాగరాజస్వామి వారి ఆరాధనోత్సవాలు శ్రీత్యాగరాజ గాన సభ ఆధ్వర్యంలో శనివారం జరిగాయి.



చిరకాల స్వప్నం సాకారం

రెవెన్యూ డివిజన్ కేంద్రంగా తాడేపల్లిగూడెం ఏర్పాటుతో తన చిరకాల స్వప్నం సాకారమైందని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. IIలో ▸

న్యూస్‌రీల్

పల్స్ పోలియోకు ఏర్పాట్లు పూర్తి



వివరాలు వెల్లడిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ మహేశ్వరరావు

భీమవరం (ప్రకాశం చౌక్): జిల్లాలో ఆదివారం నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డి.మహేశ్వరరావు చెప్పారు. జిల్లాలో పల్స్‌పోలియో ఏర్పాట్లపై వివరాలను శనివారం తన కార్యాలయంలో విలేకరులకు వెల్లడించారు. ఆదివారం నేషనల్ ఇమ్యునైజేషన్ డే సందర్భంగా జిల్లాలో నిర్వహించే పల్స్ పోలియో ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ప్రజల భాగస్వామ్యంతోనే పోలియో నిర్మూలన సాధ్యమన్నారు. ఆదివారం పోలియో చుక్కలు వేయించుకోలేని పిల్లలకు 4, 5 తేదీలలో సిబ్బంది ఇంటింటికి వెళ్లి పోలియో చుక్కలు వేస్తారన్నారు. పోలియో చుక్కలు వేసిన పిల్లలకు మార్క్ చేయాలని, పోలియో చుక్కలు వేసిన తర్వాత ఇబ్బందులు తలెత్తితే వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామన్నారు. జిల్లాలో ఐదేళ్ల లోపు లోపు చిన్నారులు 1,85,953 మంది ఉన్నారన్నారు. వీరి కోసం 1,315 పబ్లిక్ బూత్‌లు, 45 మొబైల్ బూత్‌లు, 34 ట్రాన్సిస్ట్ బూత్‌లను ఏర్పాటు చేసి వాటిలో 5,520 మంది వలంటీర్లను నియమించామన్నారు. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డా.దేవ సుధాలక్ష్మి, డీపీఎంఓ సీహెచ్ ధనలక్ష్మి, గణాంక అధికారి ఎంఎస్ ఎస్.ప్రసాదు పాల్గొన్నారు.

టెట్‌కు 656 మంది హాజరు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జిల్లాలో టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) పరీక్షలు ప్రశాంత వాతావరణంలో కొనసాగుతున్నాయి. ఐదో రోజు శనివారం జరిగిన పరీక్షలకు మొత్తం 656 మంది హాజరయ్యారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించిన పరీక్షకు 365 మందికి 328 మంది హాజరు కాగా 37 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించిన పరీక్షకు 365 మందికి 328 మంది హాజరు కాగా 37 మంది గైర్హాజరయ్యారు. పరీక్షల్లో ఎటువంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం తెలిపారు.

ఇంటర్ పరీక్షలకు 13,660 మంది హాజరు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా జరుగుతున్న థియరీ పరీక్షలు శనివారం ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు జరిగాయి. ఏలూరు జిల్లా వ్యాప్తంగా కేటాయించిన 51 కేంద్రాల్లో తెలుగు, సంస్కృతం, హిందీ, ఉర్దూ-2 పరీక్షలకు మొత్తం 14,081 మంది విద్యార్థులకు 13,660 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో 12,184 మంది జనరల్ విద్యార్థులకు 11,894 మంది హాజరు కాగా 290 మంది గైర్హాజరయ్యారు. అలాగే 1,897 మంది ఒకేషనల్ విద్యార్థులకు 1766 మంది హాజరు కాగా 131 మంది గైర్హాజరయ్యారు. మొత్తం విద్యార్థుల హాజరు 97 శాతంగా నమోదైంది.

డీఎస్సీ పరీక్షలపై సందేహాలుంటే తెలపండి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జిల్లాలో ఏపీ టెట్, డీఎస్సీ-2024 పరీక్షలు రాసే అభ్యర్థులకు ఎటువంటి సందేహాలు ఉన్నా సంబంధిత అధికారులను ఫోన్‌లో సంప్రదించి సందేహాలను నివృత్తి చేసుకోవచ్చని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు అభ్యర్థులు అసిస్టెంట్ డైరెక్టర్ 94925 15116, పర్యవేక్షకుని 83281 86618, సీనియర్ అసిస్టెంట్ 9030723444 నంబర్‌లో సంప్రదించవచ్చని సూచించారు. ఆయా పరీక్షలు రాసే అభ్యర్థులు తమ హాల్‌టికెట్, గుర్తింపు ఐడీతో పరీక్షా సమయానికి గంట ముందుగా చేరుకోవాలని, పరీక్ష సమయం దాటి ఒక్క నిమిషమైనా అభ్యర్థులను అనుమతించబోమని స్పష్టం చేశారు.

జలం.. ఇక పుష్కలం

- నరసాపురం మున్సిపాలిటీలో మంచినీటి కష్టాలకు తెర
- రూ.81.81 కోట్లతో స్పెషల్ డ్రింకింగ్ ప్రాజెక్టు
- పైప్‌లైన్‌ల ఆధునికీకరణ, 3 ఓహెచ్‌ఆర్‌ల నిర్మాణం
- రూ.61.81 కోట్లతో తొలిదశ పనులకు టెండర్లు పూర్తి
- రెండో విడతలో తాజాగా రూ.20 కోట్లు మంజూరు



నరసాపురంలో భారీ విస్తీర్ణంలో ఉన్న మంచినీటి రిజర్వాయర్

నరసాపురం: నరసాపురం మున్సిపాలిటీలో స్పెషల్ డ్రింకింగ్ ప్రాజెక్టు పనులు ప్రారంభం కానున్న నేపథ్యంలో మంచినీటి కష్టాలకు ఇక తెరపడనుంది. పట్టణంలోని పాత పైప్‌లైన్‌లను పూర్తిగా ఆధునీకరించడంతో పాటు అదనంగా ఓహెచ్‌ఆర్‌ల నిర్మాణం చేపట్టడానికి వీలుగా రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది నవంబర్‌లో తీసుకున్న నిర్ణయం అమలుకు నోచుకోనుంది. మునిసిపాలిటీలో రూ.81.81 కోట్లతో చేపట్టనున్న స్పెషల్ డ్రింకింగ్ ప్రాజెక్ట్ పట్టాలెక్కింది. తొలుత ప్రాజెక్ట్ నిమిత్తం రూ.61.81 కోట్లను ప్రభుత్వం మంజూరు చేయగా, ఈ పనులకు సంబంధించి ఇప్పటికే టెండర్ల ప్రక్రియ పూర్తయింది. అయితే అదనంగా ఓహెచ్‌ఆర్‌ల నిర్మాణాలు, ఇతర అవసరాల కోసం ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు చొరవతో ప్రభుత్వం మరో రూ.20 కోట్లు మంజూరు చేసింది. దీంతో ఓహెచ్‌ఆర్‌ల నిర్మాణాలకు సంబంధించిన అంచనాలు రూపొందించడంలో అధికారులు నిమగ్నమయ్యారు. ప్రాజెక్ట్‌కు సంబంధించి సాంకేతిక అనుమతులు ఇస్తూ మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ రెండేళ్ల క్రితమే జీవో నంబర్ 15 విడుదల చేసింది. ఈ ప్రాజెక్ట్‌తో 50 ఏళ్ల దీర్ఘకాలిక మంచినీటి సరఫరా సమస్యలకు ఎట్టకేలకు పరిష్కారం లభించనుంది.

నీరు అందుబాటులో ఉన్నా.. సరఫరాలోనే చిక్కు

జిల్లాలో ఎక్కడా లేని విధంగా పట్టణంలో 70 ఎకరాల భారీ విస్తీర్ణంలో మంచినీటి చెరువు ఉంది. ఈ చెరువులో ఎప్పుడూ 586 మిలియన్ లీటర్ల నీరు అందుబాటులో ఉంటుంది. మంచినీటి సరఫరాకు మూడు రిజర్వాయర్లు ఉన్నాయి. 60 వేల జనాభా ఉన్న పట్టణంలో 8,760 గృహ కుళాయి కనెక్షన్లు, 120 పబ్లిక్ కుళాయిలు, 596 వాణిజ్య కనెక్షన్లు ఉన్నాయి. నీరు పుష్కలంగా ఉన్నా కూడా కుళాయిల ద్వారా పూర్తి స్థాయిలో నీరందించలేని పరిస్థితి. పైప్‌లైన్‌లు శిథిలావస్థకు చేరడంతో సిబ్బంది తక్కువ ఒత్తిడితో నీటిని వదులుతున్నారు. దీంతో కుళాయిల ద్వారా నీళ్లు సవ్యంగా రాక ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఒకవేళ ఎక్కువ ఒత్తిడితో నీటిని వదిలితే పైప్‌లైన్‌లకు ఇంకా పెద్దసంఖ్యలో లీకేజీలు ఏర్పడే ప్రమాదం ఉంది. 1956లో మున్సిపాలిటీగా అవతరించిన ఈ పట్టణంలో 50 ఏళ్ల క్రితం నిర్మించిన పైప్‌లైన్‌లను ఆధునికీకరించాలనే ఆలోచన గతంలో ప్రభుత్వాలు చేయలేదు. స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు కృషితో మంచినీటి సరఫరా మెరుగుదలకు స్పెషల్ ప్రాజెక్ట్ పట్టాలెక్కుతోంది.

ఇదీ ప్రాజెక్ట్ స్వరూపం

పట్టణంలో ప్రస్తుతం మూడు ఓహెచ్‌ఆర్‌లు ఉన్నాయి. స్పెషల్ ప్రాజెక్ట్‌లో భాగంగా మరో నాలుగు ఓహెచ్‌ఆర్‌ల నిర్మాణం చేయనున్నారు. ప్రస్తుతం 96 కిలోమీటర్లు మేర పైప్‌లైన్‌లు ఉండగా, వీటిలో 40 కిలోమీటర్ల మేర పైప్‌లైన్‌లు పూర్వం ఎప్పుడో వేసినవే. వాటిని పూర్తిస్థాయిలో ఆధునికీకరిస్తారు. దీనికి తోడుగా కొత్తగా దాదాపు మరో 30 కిలోమీటర్ల మేర శివారు ప్రాంతాలకు పైప్‌లైన్‌లు నిర్మించనున్నారు. నీటిశుద్ధి కేంద్రాన్ని పూర్తిస్థాయిలో ఆధునికీకరించనున్నారు. ముందుగా 1 నుంచి 9 వరకు వార్డుల్లో పనులు చేపట్టాలని నిర్ణయించారు.



పట్టణంలోని పంజా సెంటర్‌లో పైప్‌లైన్ లీకేజీకి చేస్తున్న మరమ్మతులు (ఫైల్)

ఇక మంచినీటి సమస్య ఉండదు



నరసాపురంలో భారీ విస్తీర్ణంలో మంచినీటి చెరువు ఉంది. కానీ పైప్‌లైన్స్ వల్లే ఇబ్బందులు ఉన్నాయి. కానీ ఈ సమస్య ఇక ఉండదు. రూ.81.81 కోట్లతో పట్టణంలో స్పెషల్ డ్రింకింగ్ ప్రాజెక్ట్ పనులు చేపడుతున్నాం. గత ఏడాది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ ప్రాజెక్ట్‌కు శంకుస్థాపన చేశారు. చాలా ప్రాంతాల్లో కొత్త పైప్‌లైన్‌లు వేస్తారు. ఇక వేసవిలో కూడా నీటి ఇబ్బంది అనేది ఉండదు. ప్రణాళికాబద్ధంగా మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు చేపట్టాం. దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని అభివృద్ధి పనులు చేస్తున్నాం.

– ముదునూరి ప్రసాదరాజు, ప్రభుత్వ చీఫ్ విప్

గత టీడీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు



నరసాపురం మున్సిపాలిటీలో ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు కృషితో శాశ్వత అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. మంచినీటి సరఫరా పైప్‌లైన్ ప్రక్షాళనకు గతంలో రూ.61.81 కోట్లతో పనులకు టెండర్లు ఖరారయ్యాయి. మళ్లీ ఎమ్మెల్యే మరో రూ.20 కోట్లు ఈ ప్రాజెక్ట్‌కు అదనంగా నిధులు మంజూరు చేయించారు. ఎప్పటి నుంచో సమస్యగా ఉన్న పైప్‌లైన్స్ ఆధునికీకరణకు పూనుకున్నాం. అలాగే రూ.220 కోట్లతో అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ ప్రాజెక్ట్ కూడా తీసుకువచ్చారు. గత ప్రభుత్వాలు ఇలాంటి పనులు చేసిన దాఖలాలు లేవు.

– బర్రి శ్రీవెంకటరమణ, మున్సిపల్ చైర్‌పర్సన్

అభ్యర్థుల ఖర్చులు పకడ్బందీగా సిద్ధం చేయండి



కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

భీమవరం: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఖర్చుల నివేదికలు ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా పకడ్బందీగా సిద్ధం చేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ చెప్పారు. శనివారం భీమవరం ఎస్‌ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్ (ఎఫ్‌ఎస్‌టి), వీడియో సర్వేలైన్స్ టీం (వీఎస్‌టీ), వీడియో వ్యూయింగ్ టీమ్ (వీవీటి), స్టాటిక్ సర్వే లైన్స్ టీం(ఎస్‌ఎస్‌టి) బృందాలకు ఏర్పాటు చేసిన శిక్షణా తరగతుల్లో కలెక్టర్ మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల్లో అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. పార్లమెంటు అభ్యర్థికి రూ.95 లక్షలు, ఎమెల్యే అభ్యర్థికి రూ.40 లక్షలు ఖర్చు చేయడానికి అనుమతి ఉందన్నారు. ఎక్కడైనా అక్రమంగా నగదు, వస్తువులు పంపిణీ చేస్తుంటే వెంటనే ఎన్నికల సీజర్ మేనేజ్‌మెంట్ సిస్టంలో వివరాలు నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో సుమారు 16.70 లక్షల మంది ఓటర్లకు 1,461 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, అధికారులంతా ఎన్నికల ప్రవర్తన నియమావళికి లోబడి మాత్రమే వ్యవహరించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ స్పష్టం చేశారు. ఉద్యోగులు ఎన్నికల నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎస్పీ వేజెండ్ల అజిత మాట్లాడుతూ జిల్లా సరిహద్దుల్లో ఐదు చెక్‌పోస్టులు, 14 సర్వే లైన్స్ టీమ్స్‌ను ఏర్పాటు చేశామని, ఎక్కడా డబ్బు, మద్యం, మాదక ద్రవ్యాల రవాణా జరగకుండా చూడాలన్నారు. సరిహద్దు ప్రాంతాల్లోని చెక్‌పోస్టులలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించాలన్నారు. ఇన్‌చార్జ్ డీఆర్వో బి.శివనారాయణరెడ్డి, అడిషనల్ ఎస్పీ వి.భీమారావు, సెబ్ ఏఎస్పీ ఏటీవీ రవి కుమార్, ఆర్డీవోలు కె.శ్రీనివాసులురాజు, ఎం.అచ్యుత అంబరీష్, కె.చెన్నయ్య, డీఎస్పీలు మూర్తి, నారాయణస్వామిరెడ్డి, జిల్లా ఎన్నికల శిక్షణ నోడల్ అధికారి కేసీహెచ్ అప్పారావు పాల్గొన్నారు.

గూడెంలో త్వరలో మహిళా మార్టు

మెప్మా మిషన్ రాష్ట్ర డైరెక్టర్ వి.విజయలక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న విజయలక్ష్మి

తాడేపల్లిగూడెం అర్బన్: మెప్మా నిర్వహణలో త్వరలో తాడేపల్లిగూడెంలో మహిళా మార్టును ఏర్పాటు చేస్తున్నట్లు మెప్మా మిషన్ రాష్ట్ర డైరెక్టర్ వి.విజయలక్ష్మి వెల్లడించారు. జిల్లాలోని ఆరు మున్సిపాలిటీల ఆర్పీలతో తాడేపల్లిగూడెం మున్సిపల్ కార్యాలయంలో శనివారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమృద్ధి యూనిట్స్, ప్రగతి యూనిట్, జగనన్న తోడు, డ్వాక్రా రుణాలు, మెప్మా బ్యాంకు రుణాలు, ఎస్‌హెచ్‌జీ రుణాలు తద్వారా చేపడుతున్న లైవ్లీఫుడ్స్ తదితర పభుత్వ కార్యక్రమాలు ఏవిధంగా అమలవుతున్నాయనే అంశాలపై రీసోర్స్ పర్సన్లను అడిగి వివరాలు తెలుసుకున్నారు. దీనిలో భాగంగా జూమ్ కాన్ఫరెన్స్‌ను నిర్వహించి జిల్లాలోని ఎస్‌హెచ్‌జీ మహిళల అభిప్రాయాలను సేకరించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల ద్వారా పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ద్వారా అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకునే దిశగా మెప్మా అధికారులు,, ఆర్పీలు కృషి చేయాలని సూచించారు. మెప్మా పథకాల ద్వారా పొందిన లబ్ధి, ఆర్థిక పరిపుష్టిని సాధించిన వారి వివరాలు తెలుసుకున్నారు. సమృద్ధి స్కీమ్‌కు సంబంధించి రూ.27 లక్షలు తాడేపల్లిగూడెం పట్టణానికి మంజూరయ్యాయని, సమృద్ధి యూనిట్‌ను ఏర్పాటు చేసుకున్న స్లమ్ ఫెడరేషన్లలోని ఒక్కక్కరికి రూ.50 వేలు రుణం అందిస్తామన్నారు. తాడేపల్లిగూడెం పట్టణంలో 50 స్లమ్ లెవెల్ ఫెడరేషన్లకు మంజూరు చేశామన్నారు. తాడేపల్లిగూడెంలో 1,850 స్వయం సహాయక సంఘాలు, ఎస్‌ఎల్‌ఎఫ్‌లు 50 ఉన్నాయన్నారు. స్టేట్ మిషన్ మేనేజర్ ఆర్.ఆదినారాయణ, ఎస్ఎస్ఆర్ శ్రీనివాస్, రంగాచారి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రామాంజనేయులు, డ్వాక్రా సంఘాల పట్టణ అధ్యక్షురాలు బోళం రామలక్ష్మి, సిటీ మిషన్ మేనేజర్ బీహెచ్ శ్రీనివాస్, మిషన్ ఆర్గనైజర్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల తీర్చడమే లక్ష్యం

- ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ
- లబ్ధిదారులకు జగనన్న ఇంటి స్థలం హక్కు పత్రాల అందజేత



లబ్ధిదారుకు స్థలం హక్కు పత్రాలను అందిస్తున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు, కలెక్టర్ సుమిత్‌కుమార్

తాడేపల్లిగూడెం అర్బన్: ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కల తీర్చడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. జగనన్న రిజిస్ట్రేషన్ చేయించి ఇంటి స్థలం హక్కు పత్రాలను జగనన్న కాలనీలలో ఇంటి స్థలం పొందిన లబ్ధిదారులకు శనివారం ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ చేతులమీదుగా అందజేశారు. స్థానిక ఆర్ అండ్‌బీ బంగ్లాలో మున్సిపల్ కమిషనర్ డాక్టర్ అనపర్తి శామ్యూల్ అధ్యక్షతన హక్కు పత్రాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి కొట్టు మాట్లాడుతూ తాను మొదటిసారిగా ఎమ్మెల్యేగా గెలిచిన అనంతరం ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో పేదలకు ఇళ్లు నిర్మించేందుకు 56 ఎకరాల విమానాశ్రయ భూమిని ఆక్రమణదారుల నుంచి విడిపించి మెరక చేసి సిద్ధంగా ఉంచామన్నారు. అనంతరం వచ్చిన రాజకీయ పరిణామాల కారణంగా ఇక్కడ ఏపీ టిడ్కో గృహాలు నిర్మించారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల్లో భాగంగా జగనన్న కాలనీలు ఏర్పాటు చేశారన్నారు. ఆ పథకంలో భాగంగా పేదలకు సొంతి ఇళ్లు ఉండాలనే అభిలాషతో ప్రతి పేద కుటుంబానికి సెంటు భూమిని ఉచితంగా ఇచ్చి ఇల్లు నిర్మించుకునేందుకు ప్రభుత్వం ఆర్థికసాయం అందించిందన్నారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో సుమారు 5,386 స్థలాలు ఇవ్వగా, వాటిలో ప్రస్తుతం 3,600 మందికి ఇళ్ల స్థలాల హక్కు పత్రాలను అందిస్తున్నామన్నారు. ఈ పత్రాలు శాశ్వత భూహక్కు పత్రాలుగా చెలామణి అవుతాయన్నారు. ఈ హక్కు పత్రాలపై బ్యాంకు రుణాలు పొందవచ్చునని లేదా విక్రయించుకోవచ్చన్నారు. దీనిపై లబ్ధిదారునికి పూర్తి హక్కును కల్పించిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌కే దక్కుతుందన్నారు.

విమానాశ్రయ నివాసులకు పట్టాలు

విమానాశ్రయభూముల్లో 40 ఏళ్ల నుంచి నివాసాలు ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నవారిలో 100 చదరపు గజాలు ఆక్రమించుకుని నివాసం ఉంటున్న వారికి పట్టాలు ఇచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నామని మంత్రి చెప్పారు. 100 చదరపు గజాలకు మించి ఆక్రమించుకున్న వారి స్థలాలకు ధర నిర్ణయించి పట్టాలు ఇవ్వడానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆలోచన చేస్తోందని వెల్లడించారు.

పేదలను మోసం చేసిన చంద్రబాబు

పేదలకు పక్కా గృహాలు నిర్మించి ఇస్తామని చెప్పిన చంద్రబాబు తెదేపా ప్రభుత్వంలో ఒక్క ఇల్లు కూడా ఇచ్చిన దాఖలాలు లేవని ఉ పముఖమంత్రి కొట్టు సత్యనారాయణ విమర్శించారు. ఏపీ టిడ్కో గృహాలు నిర్మించే నేపథ్యంలో ప్లాటుకు రూ.2.50 లక్షల చొప్పున రూ.వేల కోట్లు దోచుకున్నాడని ఆరోపించారు. రైతు రుణమాఫీ, బంగారం రుణమాఫీ, డ్వాక్రా రుణమాఫీ అంటూ ప్రజలను మోసం చేసిన చంద్రబాబుకు 2019 ఎన్నికల్లో ప్రజలు మర్చిపోలేని గుణపాఠం చెప్పారని, 2024 ఎన్నికలు సమీపిస్తున్న వేళ మాయమాటలు చెప్పి మళ్లీ మోసం చేసేందుకు జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌తో కలిసి చంద్రబాబు వస్తున్నాడని ప్రజలు నమ్మవద్దని మంత్రి కొట్టు అన్నారు. అనంతరం జగనన్న కాలనీ లబ్ధిదారులకు ఇంటి స్థల హక్కు పత్రాలను మంత్రి కొట్టు, కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ పంపిణీ చేశారు. అనంతరం రెవెన్యూ సిబ్బంది మంత్రి కొట్టును సత్కరించారు. తహసీల్దార్ బంద్రెడ్డి మురళీకృష్ణ, మున్సిపల్ కమిషనర్ డాక్టర్ అనపర్తి శామ్యూల్, మాజీ ఎమ్మెల్యే వైఎస్సార్ సీపీ నాయకులు పసల కనకసుందర రావు, ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్, తమ్మిశెట్టి చుక్కయ్య, గుండుబోగుల నాగు, కొట్టు విశాల్ పాల్గొన్నారు.

కాళీపట్నం భూసమస్యకు శాశ్వత పరిష్కారం

- చీఫ్ విప్ మదునూరి ప్రసాదరాజు
- రైతులకు పట్టాల పంపిణీ



కాళీపట్నం రైతులకు పట్టాలు పంపిణీ చేస్తున్న చీఫ్ విప్ ప్రసాదరాజు, కలెక్టర్ సుమిత్ కుమార్

మొగల్తూరు: ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న కాళీపట్నం జమిందారి భూముల సమస్య పరిష్కరించిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుందని చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. శనివారం సాయంత్రం కాళీపట్నం పడమర గ్రామంలో ఏర్పాటు చేసిన పట్టాలు పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మహానేత వైఎస్సార్ హయాంలో నాటి మంత్రి మండలిలో చర్చించి కాళీపట్నం రెవెన్యూ పరిధిలో భూములు సాగు చేసుకుంటున్న రైతులకు భూహక్కు కల్పించేలా జీఓ ఇచ్చారన్నారు. అయితే కొందరు రాష్ట్ర ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో నాటి నుంచి సమస్య పరిష్కారానికి నోచుకోలేదన్నారు. ఈ సమస్యను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన రెడ్డి దృష్టికి తీసుకువెళ్లడంతో కొత్తగా జీఓ నంబర్ 7ను జారీ చేశారన్నారు. ఈ జీవో ప్రకారం 1945 కటాఫ్ డేట్‌గా నిర్ణయించి రైతులకు భూహక్కు కలిపిస్తూ పట్టాలు ఇచ్చేలా ఆదేశాలు ఇచ్చారన్నారు. దీనిలో భాగంగా శనివారం నుంచి పట్టాలు పంపిణీ కార్యక్రమం ప్రారంభించామని తొలిరోజు పది మంది రైతులకు భూహక్కు కల్పిస్తూ పట్టాలు అందించామన్నారు. శనివారం నుంచి కాళీపట్నం రెవెన్యూ పరిధిలోని రైతులు కలెక్టర్ వద్ద తమ పేర్లు నమోదు చేసుకుని భూమికి సంబంధించిన పత్రాలను అధికారులకు అందించాలన్నారు. రైతులకు సర్వహక్కులు కల్పిస్తూ రిజిస్ట్రేషన్ చేసే విధంగా చేపట్టే కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ మద్దతు పలకాలన్నారు. అనంతరం అదే గ్రామంలో జగనన్న కాలనీల్లో నివాసాలు ఏర్పాటు చేసుకున్న లబ్ధిదారులకు ఇంటి స్థల హక్కుపత్రాలు (దస్తావేజులు) పంపిణీ చేశారు. ప్రభుత్వం రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చిన దస్తావేజులపై లబ్ధిదారులు పూర్తి హక్కులు కలిగి ఉంటాడన్నారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ, సబ్ కలెక్టర్ అంబరీష్, తహసీల్దార్ భాస్కర్, డీటీ సూర్యనారాయణరాజు, సర్పంచ్ కవురు సావిత్రి, వైస్ ఎంపీపీలు కవురు సీతామహలక్ష్మీ, కైలా సుబ్బారావు, సొసైటీ అధ్యక్షుడు దొంగ నాగముని, మోటుపల్లి రామభాస్కరరావు, జెడ్పీటీసీ సభ్యులు తిరుమాని బాపూజీ, బొక్కా రాధాకృష్ణ, మత్యకార కార్పొరేషన్ చైర్మన్ తిరుమాని నాగరాజు పాల్గొన్నారు.

చిరకాల స్వప్నం.. సాకారం

ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్: తాను రాజకీయాల్లోకి వచ్చినప్పటి నుంచి తాను కన్న చిరకాలం నాటి కల సాకారమయిందని తాడేపల్లిగూడెంలో రెవెన్యూ డివిజినల్ కార్యాలయాన్ని (ఆర్‌డీఓ) ఏర్పాటు చేయాలని కోరుకున్న కల ఈనాటికి సాకారమయినందుకు సంతోషంగా ఉందని ఉపముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. స్థానిక ఆర్ అండ్‌బీ బంగ్లా ప్రాంగణంలో రెవెన్యూ డివిజనల్ కార్యాలయాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో తాడేపల్లిగూడెంలో ఆర్‌డీఓ కార్యాలయం ఏర్పాటు చేయాలని తాను కోరిన సమయంలో తాడేపల్లిగూడెంలో సంబంధిత కార్యాలయం ఏర్పాటు చేసేందుకు శాఖాపరమైన ఇబ్బందులు ఉన్నాయని చెప్పారన్నారు. అయినా తాను కన్న కల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేశారని ఆనందం వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ మాట్లాడుతూ మండల రెవెన్యూ కార్యాలయం పరిధికి మించి వచ్చిన సమస్యలకు ప్రజలు జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వెళ్లాల్సి వచ్చిందేన్నారు. ఇప్పుడు ఆ పరిస్థితి నుంచి విముక్తి లభించిందని తాడేపల్లిగూడెంతో పాటు 5 మండలాలకు చెందిన 6.50 లక్షల మంది ప్రజలు తాడేపల్లిగూడెంలో ఏర్పాటు చేసిన ఆర్‌డీఓ కార్యాలయాన్ని వినియోగించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ చెన్నయ్య, తహసీల్దార్ బండ్రెడ్డి మురళీకృష్ణ, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్డీఓ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి కొట్టు, జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

వైఎస్సార్ సీపీ విజయానికి సైనికుల్లా పని చేయాలి

పాలకొల్లు అర్బన్ : రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి సైనికుల్లా పనిచేయాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) కోరారు. పాలకొల్లు మండలం చింతపర్రులో కాంగ్రెస్ పార్టీ నేత పెన్మెత్స రామరాజు, టీడీపీ నాయకుడు గుమ్మాపు సురేష్ తదితరులు శనివారం వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి గుడాల గోపి వైఎస్సార్ సీపీ కండువాలు మెడలో వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా గోపి మాట్లాడుతూ చింతపర్రులో ట్రస్ట్ ఏర్పాటు చేసి ఆ ట్రస్ట్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించి ప్రముఖ దాతగా ముద్రపడిన రామరాజు వైఎస్సార్ సీపీలో చేరడం పార్టీకి మరింత బలం చేకూరినట్లు భావిస్తున్నానన్నారు. గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకులంతా సమన్వయంతో పనిచేసి వైఎస్సార్ సీపీకి స్థానిక సంస్థల ఎన్నికల్లో కన్నా ఎక్కువ మెజార్టీ వచ్చేలా కృషి చేయాలని గోపి కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు డవన గోవిందరాజుల నాయుడు, సర్పంచ్ గుమ్మాపు పెద్దిరాజు, ఉప సర్పంచ్ పెన్మెత్స వెంకట కృష్ణంరాజు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ, మండల పరిషత్ మాజీ ప్రతిపక్ష నేత చిట్టూరి ఏడుకొండలు, మండల కన్వీనర్ విప్పర్తి ప్రభాకరరావు పాల్గొన్నారు.



వైఎస్సార్ సీపీలో చేరిన రామరాజును పార్టీలోకి ఆహ్వానిస్తున్న గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి)

ఎన్నికల్లో నిష్పక్షపాతంగా పని చేయాలి

భీమవరం : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో విధి నిర్వహణలో ఉన్న సిబ్బంది పక్షపాతం లేకుండా నియమ నిబంధనలకు అనుగుణంగా పని చేయాలని జిల్లా ఎస్పీ వేజెండ్ల అజిత అన్నారు. శనివారం భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ నేతృత్వంలో జిల్లాలోని పోలీసు అధికారులు, సిబ్బందికి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రధానంగా ఎన్నికల సమయంలో ఉద్యోగ నిర్వహణలో అలసత్వం పనికి రాదని స్పష్టం చేశారు. ఓట్లు కోసం ప్రజలకు ప్రలోభాలకు గురి చేసేందుకు ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు పంపిణీ చేయడానికి సిద్ధం చేసిన వస్తువులను స్వాధీనం చేసుకోవాలని, ప్రచారంలో వినియోగించే ఆర్థిక అంశాలన్నింటినీ రికార్డు చేయాలన్నారు. ప్రజలు ఓటు హక్కును వినియోగించుకునే విధంగా పోలీసులు కృషి చేయాలన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ అజిత

చంద్రబాబు, పవన్ జెండా సభ అట్టర్ ఫ్లాప్

పాలకొల్లు అర్బన్: తాడేపల్లిగూడెంలో తెలుగుదేశం, జనసేన పార్టీలు ఉమ్మడిగా నిర్వహించిన జెండా సభ అట్టర్ ఫ్లాప్ అయ్యిందని మాలమహనాడు జాతీయ అధ్యక్షుడు, రాష్ట్ర ప్రభుత్వ ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మోనటరింగ్ జిల్లా కమిటీ సభ్యుడు చీకటిమిల్లి మంగరాజు అన్నారు. పాలకొల్లు మాలమహనాడు కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జెండా సభకు 50 వేల మంది కూడా రాకపోవడంతో చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఖంగుతిన్నారన్నారు. ఈ సభలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై పవన్ వ్యాఖ్యలను ఖండించారు. రెండు నెలలు ఓపికపడితే ఎవరిబలం ఎంతో తేలుతుందన్నారు. సమావేశంలో మాలమహనాడు రాష్ట్ర అధ్యక్షుడు గుమ్మాపు సూర్యవరప్రసాద్, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ సభ్యులు పొన్నమండ బాలకృష్ణ, వీరవల్లి సునీల్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చీకటిమిల్లి మంగరాజు

బాలికపై అత్యాచారం

అత్తిలి: మండలంలోని ఈడూరు గ్రామానికి చెందిన పులవర్తి అయ్యప్ప అనే యువకుడు తమ కుమార్తెను అత్యాచారం చేశాడంటూ తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై వి.రాంబాబు శనివారం తెలిపారు. ఎస్సై రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం రైల్వేస్టేషన్ రోడ్డులో బాలిక తల్లి అద్దెకు ఉంటోంది. ఆమె కుమార్తె ఏడో తరగతి చదివి ఇంటి వద్దనే ఉంటోంది. అయితే అదే భవనంపై అద్దెకు ఉంటున్న పులవర్తి ప్రసాద్‌సోదరుడు ఈడూరు గ్రామానికి చెందిన పులవర్తి అయ్యప్ప కింద పోర్షన్‌లో ఉంటున్న బాలిక వద్దకు వచ్చి మాయమాటలు చెప్పి గత నెల 18న, తిరిగి 26న అత్యాచారం చేశాడు. దీంతో విషయం తెలుసుకున్న బాధితురాలి తల్లి శనివారం పోలీసులను ఆశ్రయించింది.

గమనిక

సాక్షి తెలుగు దిన పత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

క్లుప్తంగా

రామాలయ నిర్మాణానికి శంకుస్థాపన



మాధవరం హరిజనవాడలో నిర్మిస్తున్న రామాలయానికి శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని మాధవరం హరిజన వాడలో నూతనంగా నిర్మిస్తున్న రామాలయానికి శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ నారా రామచంద్రం మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ రూ.10లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. తొలుత నారా రామచంద్రం దంపతులు పూజా కార్యక్రమాలు జరిపారు. ఈ కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు జద్దు హరిబాబు, నాయకులు తారమట్ల శ్రీనివాస్, ప్రత్తి రంగయ్య పాల్గొన్నారు.

వరాల వెంకన్నకు విశేష పూజలు



ఈడూరులో విశేష అలంకరణలో వరాల వెంకటేశ్వరస్వామి

అత్తిలి: ఈడూరు గ్రామంలో వేంచేసియున్న వరాల వెంకటేశ్వరస్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారు జామున స్వామివారికి సుప్రభాతసేవ, తోమాలసేవ జరిపారు. ఉదయం అర్చనలు చేసి, స్వామివారిని విశేషంగా అలంకరించారు. ఆలయ అర్చకులు వాడపల్లి శేఖరాచార్యులు ఆధ్వర్యంలో పూజలు జరిపారు. పరిసర గ్రామాల నుంచి వేలాది మంది భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. హాజరైన భక్తులకు దాత సహకారంతో అన్నదానం చేశారు.

ఆర్టీసీలో ప్రయాణం సురక్షితం



ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్న డీఎం యేలూరి సత్యనారాయణ మూర్తి

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఆర్టీసీలో ప్రయాణం సురక్షితమని ఏపీఎస్ ఆర్టీసీ డిపో మేనేజర్ యేలూరి సత్యనారాయణమూర్తి వెల్లడించారు. ఆర్టీసీ బస్సు కాంప్లెక్స్‌లో శనివారం ప్రయాణీకుల వెళ్లే జంగారెడ్డిగూడెం, ఆచంట, గణపవరం, భీమవరం రూట్లుల్లో ప్రయాణీకుల కోసం లక్కీడిప్ తీశారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ తాడేపల్లిగూడెం డిపో నుంచి అయోధ్య, కాశీ యాత్ర నిర్వహిస్తున్నట్లు ఈ సందర్భంగా కరపత్రాలను విడుదల చేశారు. తాడేపల్లిగూడెం నుంచి కేవలం బస్సు టిక్కెట్ ఒకొక్కరికి రూ.12,700లు యాత్రకు ఖర్చు అవుతుందని చెప్పారు. భక్తులు ఈ యాత్రను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వలంటీర్ల సేవలకు వందనం

- వలంటీర్లకు అవార్డులందించిన ప్రభుత్వం
- సేవచేసే అవకాశం జగనన్న ఇచ్చారంటున్న వైనం
- నియోజకవర్గంలో 1,396 మంది వలంటీర్లకు అవార్డులు



తణుకులో అవార్డులు పొందిన వలంటీర్లను సత్కరించిన మంత్రి కారుమూరి (ఫైల్)



తణుకులో లబ్ధిదారుకు పింఛను అందజేస్తున్న వలంటీరు

తణుకు అర్బన్: ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధుల్లా వ్యవహరిస్తూ సంక్షేమ పథకాలను పారదర్శకంగా అందజేస్తున్న వలంటీర్ల సేవలు విరాజిల్లుతున్నాయి. వేకువజామునే లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందజేస్తున్న వలంటీర్ల సేవలు ప్రజానీకం సైతం వేనోళ్లపొగుడుతున్నారు. నవరత్నాలను పేద ప్రజలకు అవినీతిరహితంగా అందించాలనే దృఢనిశ్చయంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను సృష్టించి ఆ సచివాలయాలకు అనుసంధానంగా పనిచేసే విధంగా వలంటీరు వ్యవస్థను ప్రవేశపెట్టారు. సామాజిక పింఛను నుంచి సంక్షేమ పథకాల వరకు ప్రజలకు చేరువ చేయడంలో వలంటీర్లు కీలకపాత్ర పోషిస్తున్నారు. అంతేకాకుండా ఇంటి గుమ్మంలోకే రేషన్ అందించే క్రమంలో వలంటీర్లు తమ పరిధిలోని 50 ఇళ్లకు సంబంధించి వాహనం కూడానే ఉంటూ రేషన్ అందజేస్తున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత వలంటీర్ల ద్వారా పింఛను, సంక్షేమం సక్రమంగా అందుతుందని ప్రజానీకం సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తణుకు నియోజకవర్గంలో తణుకు మున్సిపాలిటీ, తణుకు, అత్తిలి, ఇరగవరం మండలాలకు సంబంధించి మొత్తం 1,371 మందికి సేవామిత్ర, 20 మందికి సేవారత్న, 5గురికి సేవావజ్ర అవార్డులు ప్రభుత్వం అందజేసింది.

జన్మభూమి కమిటీలతో విసిగిపోయిన ప్రజానీకం

టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీల పేరుతో ప్రజలను రాబందుల్లా పిప్పిపీల్చేసిన వైనానికి ప్రజలు విసుగెత్తిపోయారు. దీంతో ప్రజా సంకల్పయాత్రలో ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం వలంటీరు వ్యవస్థ ద్వారా సంక్షేమ ఫలాలను పారదర్శకంగా ప్రజల బ్యాంకు ఖాతాలకే జమచేస్తుంది జగన్ ప్రభుత్వం. సేవ చేసే రూపంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన అవకాశాన్ని వలంటీర్లు సద్వినియోగం చేసుకుని ప్రజలకు మంచి సేవలందిస్తున్నారు. ప్రభుత్వం ఇస్తున్న గౌరవ వేతనంతోపాటు ప్రతి ఏడాది వలంటీర్ల సేవలను కొనియాడుతూ సేవా మిత్ర, సేవా రత్న, సేవా వజ్ర పేరుతో మూడు కేటగిరీల్లో అవార్డులు ప్రకటించి నగదు ప్రోత్సాహక అవార్డులు అందజేస్తున్నారు. ఇందులో భాగంగా సేవా మిత్రకు రూ.15వేలు, సేవా రత్నకు రూ.30 వేలు, సేవా వజ్రకు రూ. 45వేలు చొప్పున వలంటీర్లకు వందనం పేరుతో వలంటీర్లను ఘనంగా సత్కరించి ఈ ఏడాది ప్రభుత్వం అందజేసింది. తణుకు నియోజకవర్గంలో రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారు మూరి నాగేశ్వరరావు తణుకు పట్టణంలో వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు.

తణుకు నియోజకవర్గంలో వలంటీర్లకు అవార్డులు ఇలా

	సేవా మిత్ర	సేవా రత్న	సేవా వజ్ర
తణుకు	439	5	–
తణుకు రూరల్	264	5	2
అత్తిలి	383	5	1
ఇరగవరం	285	5	2

వలంటీర్ల సేవలు అభినందనీయం



రాష్ట్ర వ్యాప్తంగా వలంటీరు వ్యవస్థ ద్వారా ప్రజలకు అందుతున్న సేవలను ప్రతి ఒక్కరూ అభినందిస్తున్నారు. ముఖ్యంగా తెల్లవారకుండానే పింఛను పంపిణీని పింఛనుదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వలంటీరు అంటే తమ కుటుంబ సభ్యుడిగా ప్రజలు వారిపై ప్రేమాభిమానాలు చూపిస్తున్నారు.

– యిందుగపల్లి బలరామకృష్ణ, తణుకు పట్టణ జేసీఎస్ కన్వీనర్

సేవా వజ్ర అవార్డు దక్కింది



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు మంచి నాణ్యమైన సేవలందించాలనే వలంటీరు వ్యవస్థను ఏర్పాటుచేశారు. మాపై ఆయన పెట్టుకున్న నమ్మకాన్ని వృధా చేయకుండా మా విధుల్లో మేము బాధ్యతగా వ్యవహరిస్తున్నాము. నా సేవలకు గుర్తించి నాకు సేవా రత్న అవార్డు ద్వారా ప్రభుత్వం అందజేసి రూ. 30వేలు నగదు అందింది.

– గంధం దుర్గాభవాని, వలంటీరు

మా గౌరవం పెరిగింది



ప్రజలకు మంచి సేవ చేసే అవకాశం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాకు కల్పించారు. మా 50 ఇళ్లలో మేము అందజేస్తున్న సేవల కారణంగా మమ్మల్ని తమ బిడ్డలా చూసుకుంటున్నారు. ఆ కుటుంబాల్లో మంచికైనా చెడుకైనా ముందుగా నన్నే పిలుస్తారు. సీఎం జగన్ సమాజంలో మాకు మంచి గౌరవాన్ని అందజేశారు.

– రాజ్యలక్ష్మి, వలంటీరు

మా సొంత మనిషిలా వలంటీర్



ప్రతి నెలా ఒకటవ తేదీన మేము లేవకుండానే వలంటీరు గుమ్మంలోకి వచ్చి పింఛను అందిస్తున్నారు. గతంలో పింఛన్ కోసం లైన్‌లో నిలబడి చాలా ఇబ్బందులు పడేవాళ్లం. కానీ నేడు ఈ ప్రభుత్వంలో అన్నీ ఇంటిగుమ్మంలోకే వచ్చేస్తున్నాయి. మా వలంటీర్లు మమ్మల్ని సొంత మనుషుల్లాగానే చూస్తుంటారు.

– గుబ్బల రాంబాబు, పింఛన్ దారుడు

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించాలి



మండల సమాఖ్య భవనంలో ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పిస్తున్న ఏపీఎం రత్నకుమార్

అత్తిలి: గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయం చేపట్టే విధంగా రైతాంగానికి అవగాహన కల్పించాలని ప్రకృతి వ్యవసాయం ఏపీఎం బాలకోటయ్య చెప్పారు. శనివారం అత్తిలి మండల మహిళా సమాఖ్య భవనంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు నిర్వహించారు. రసాయన ఎరువులు లేకుండా వ్యవసాయం ఎలా చెయ్యవచ్చునో, ప్రకృతి వ్యవసాయం సాగు చేయడం ద్వారా తక్కువ ఖర్చుతో ఆరోగ్యకరమైన పంటలు పండించే విధానంపై బాలకోటయ్య వివరించారు. ఏపీఎం రత్నకుమార్ మాట్లాడుతూ ఆదివారం జరిగే పల్స్ పోలియో కార్యక్రమం సందర్భంగా ప్రతి గ్రామ సంఘ పరిధిలో ఐదేళ్లలోపు పిల్లలను పోలియో కేంద్రాలకు హాజరై పోలియో చుక్కలు వేయించేవిధంగా చూడాలన్నారు. త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఓటింగ్‌శాతం పెరగడానికి అర్హతగల ప్రతి ఒక్కరూ ఓటుహక్కు వినియోగించుకునే విధంగా అన్ని గ్రామ సంఘాలలో స్వయం సహాయక సంఘాల సభ్యులకు అవగాహన కల్పించాలన్నారు. ఈసందర్భంగా మహిళా సంఘ సభ్యులు ర్యాలీగా వెళ్లి బస్‌స్టేషన్ సెంటర్‌లో మానవహారంగా నిర్వహించారు. ఎటువంటి ప్రలోభాలకు తలొగ్గకుండా ఓటు హక్కును వినియోగించుకుంటామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో సీసీలు సునీత, మూర్తి, సమాఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ సేవలు అభినందనీయం



లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో రక్త పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): లయన్స్‌క్లబ్ ఆఫ్ తాడేపల్లిగూడెం సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. పట్టణంలోని కడకట్ల జనతా చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో శనివారం దాత దాలయన్ డీవీవీ విశ్వేశ్వరరావు ఆర్థిక సహకారంతో ఉచిత రక్త పరీక్షలతో పాటుగా షుగర్ వ్యాధి–నివారణపై అవగాహన శిబిరం జరిగింది. ఏరియా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ పగడాల సూర్యనారాయణ హాజరై శిబిరంను ప్రారంభించారు. 114 మందికి వైద్య పరీక్షలు జరిగాయి. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు వంగపండు రామోహన్‌రావు, రీజియన్ చైర్‌పర్సన్ మదన్ మోహన్ అగర్వాల్, సెక్రటరీ చిన్నం జగదీష్, కోశాధికారి హరిబాబు, ఎల్‌ఎస్‌వీ నాగేశ్వరరావు, బాపయ్య శర్మ, పచ్చా వెంకటేశ్వరరావు, సన్నిది సూర్యనారాయణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.


బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



విద్యార్థినులతో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్ వైజర్ వెంకటలక్ష్మి

తణుకు టౌన్: బాల్య వివాహాలు జరగకుండా విద్యార్థినులు అవగాహనతో మెలగాలని తణుకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్ వెంకట లక్ష్మీ చెప్పారు. శనివారం తణుకు రూరల్ మండలం తేతలిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బేటీ పడావో, బేటీ బచావో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్ వైజర్ వెంకటలక్ష్మీ మాట్లాడుతూ విద్యార్థినులు చదువుతో పాటు ఆత్మ రక్షణకు అవసరమైన మార్షల్ ఆర్ట్స్‌పై కూడా అవగాహన కలిగి ఉండాలన్నారు. విద్యార్థినులు వ్యక్తిగత పరిశుభ్రతతో ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం కేవీ రంగయ్య, ఉపాధ్యాయ సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మెకానిక్‌ల సమస్యలు పరిష్కరిస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న కొట్టు విశాల్

తాడేపల్లిగూడెం అర్బన్ : మోటారు సైకిల్ మెకానిక్‌లకు ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అండగా ఉంటారని యువనేత కొట్టు విశాల్ తెలిపారు. స్థానిక గుణ్ణం ఫంక్షన్ హాల్‌లో తాడేపల్లిగూడెం మోటారు మెకానిక్ ఓనర్స్ అండ్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా యువనేత కొట్టు విశాల్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న అనేక సంక్షేమ పథకాలు మోటారు సైకిల్ మెకానిక్‌ల కుటుంబాలకు అందుతున్నాయన్నారు. చెన్నా జనార్ధన్, బొద్దాని శ్రీనివాస్, పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షుడు నాయుడు వెంకటేశ్వరరావు, పసుపులేటి సత్యనారాయణ, తాడేపల్లిగూడెం పట్టణ అధ్యక్షుడు చిన్నం చినవెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు వ్యక్తిత్వ వికాసం అభివృద్ధి చేసుకోవాలి

పెంటపాడు: విద్యార్థులు వ్యక్తిత్వ వికాసం అభివృద్ధి చేసుకోవాలని జిల్లా మానవత స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ తాడేపల్లి మోహనరావు పేర్కొన్నారు. శనివారం పెంటపాడు ప్రభుత్వ పోస్టుబేసిక్ పాఠశాలలో, మధ్యాహ్నం మీనవిల్లూరు జెడ్పీ హైస్కూల్లో పదో తరగతి విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా మోహన్‌రావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, మానవత సంస్థ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కామర్స్ అభ్యర్థులకు ఉచిత ఆన్‌లైన్ శిక్షణ

తణుకు టౌన్: రాష్ట్రంలో ఏపీపీఎస్‌సీ ద్వారా డిగ్రీ, జూనియర్ అధ్యాపక పోస్టుల భర్తీకి నోటిఫికేషన్‌తో పాటు యూజీసీ, ఏపీ సెట్‌లకు దరఖాస్తు చేసిన అభ్యర్థులకు ఆన్‌లైన్‌లో శిక్షణా తరగతులను నిర్వహిస్తున్నట్లు తణుకు ప్రభుత్వ డిగ్రీ కలాశాల ప్రిన్సిపాల్ పీ అనిల్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో శిక్షణ తరగతులు నిర్వహించేందుకు వివిధ డిగ్రీ కళాశాలలో పనిచేస్తున్న కామర్స్ అధ్యాపకులు రోజుకు గంట చొప్పున బోధించేందుకు నిర్ణయించినట్లు తెలిపారు. ఈ ఉచిత ఆన్‌లైన్ శిక్షణా కార్యక్రమాన్ని అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేడు చిన్నారులకు పోలియో చుక్కలు



గూడెంలో పల్స్ పోలియో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

తణుకు అర్బన్: ఐదేళ్లలోపు చిన్నారులందరికీ పోలియో చుక్కల నిర్వహణ విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నోడల్ ఆఫీసర్ డాక్టర్ బి.దుర్గామహేశ్వరరావు అన్నారు. తణుకు బ్యాంక్ కాలనీలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదివారం నిర్వహించే పోలియో చుక్కల కార్యక్రమంలో భాగంగా పట్టణ పరిధిలో మొత్తం 52 పోలియో చుక్కల కేంద్రాలతోపాటు మరొక 3 మొబైల్ టీమ్‌ల ద్వారా చిన్నారులకు పోలియో చుక్కలు వేసేందుకు సిద్ధం చేసినట్లు తెలిపారు. పోలియో చుక్కలు పంపిణీలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. వైద్యసిబ్బంది అంతా తమకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు. 4, 5 తేదీల్లో ఇంటింటికీ వెళ్లి చిన్నారులందరికీ పోలియో చుక్కలు వేయించారా అని ఆరా తీయాల్సిన బాధ్యత కూడా ఉందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్స్ డాక్టర్ పృథ్వీరాజ్, డాక్టర్ రాజా నాగభూషణం, డాక్టర్ డానియల్ రాజు, సబ్ యూనిట్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు, రూట్ సూపర్‌వైజింగ్ ఆఫీసర్స్ త్రిమూర్తులు, భాస్కరరెడ్డి, సునీత, రత్నాభాయ్, కె.సత్యనారాయణ, హెల్త్ అసిస్టెంట్స్ పాల్గొన్నారు.

పల్స్‌పోలియో కార్యక్రమానికి 27 పోలియో బూత్‌లు సిద్ధం

అత్తిలి: నేడు జరిగే పల్స్‌పోలియో కార్యక్రమంలో భాగంగా అత్తిలి పీహెచ్‌సీ పరిధిలో 27 పోలియో బూత్‌ల ద్వారా చిన్నారులకు పోలియో చుక్కలు వేయడానికి ఏర్పాట్లు చేశామని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కె నాగరాజు చెప్పారు. అప్పుడే పుట్టిన పిల్లలు నుంచి 5 ఏళ్ల లోపు గల 3,453 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయడం జరుగుతుందని తెలిపారు.

పోలియో రహిత పట్టణంగా తీర్చిదిద్దుదాం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పోలియో రహిత పట్టణంగా తీర్చిదిద్దుదామని, పల్స్ పోలియోను కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని మలేరియా సబ్ యూనిట్ అధికారి వై.వి.లక్ష్మణరావు అన్నారు. పట్టణంలో మూడోవ తేదీన నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ శనివారం పల్స్ పోలియో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రతిసారి రెండు చుక్కలు పోలియో డ్రాప్స్‌తో పోలియోను తరిమి కొట్టవచ్చునని చెప్పారు. ఈ కార్యక్రమంలో అర్బన్ నోడల్ అధికారి డా.కోసూరి రవికుమార్, పీహెచ్‌సీ వైద్యాధికారులు, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పల్స్ పోలియోను విజయవంతం చేయాలి

పెంటపాడు: ముదునూరు, పెంటపాడు పీహెచ్‌సీల పరిధిలో ఈనెల 3న నిర్వహించబోయే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయా పీహెచ్‌సీల డాక్టర్లు పూజిత, తోట రాజేష్‌లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయా పీహెచ్‌సీలలో సిబ్బందికి సూచించారు. 5 సంవత్సరాల లోపు చిన్నారులకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలన్నారు.

6923 చిన్నారులు గుర్తింపు

తాడేపల్లిగూడెం రూరల్: పల్స్ పోలియో కార్యక్రమానికి మండలంలోని వెంకట్రామన్నగూడెం, మాధవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో 6923మంది చిన్నారులను గుర్తించినట్లు వైద్యాధికారులు శ్రీహర్ష, ఏవీ.వెంకటేష్, టి.సింధులు తెలిపారు. వెంకట్రామన్నగూడెం పీహెచ్‌సీ పరిధిలో 3096మంది చిన్నారులు కాగా, 36 బూత్‌లు, ఒక మొబైల్ టీమ్, 144మంది సిబ్బంది పనిచేస్తారన్నారు. మాధవరం పీహెచ్‌సీ పరిధిలో 136మంది సిబ్బందితో పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఐదేళ్లలోపు చిన్నారులు ప్రతి ఒక్కరికీ పోలియో చుక్కలు వేయించాలన్నారు.

పెరటి తోటల పెంపకంతో ఆరోగ్యం

తాడేపల్లిగూడెం రూరల్: వంటింటి వ్యర్థాల ద్వారా పెరటి తోటలను పెంచి ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలని ప్రకృతి వ్యవసాయం జనరల్ కోఆర్డినేటర్ జి. వెంకటరత్నం అన్నారు. శనివారం స్థానిక మండల మహిళా సమాఖ్య భవనంలో డ్వాక్రా సిబ్బందితో సమావేశం, స్వీప్ కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటరత్నం మాట్లాడుతూ గ్రామాల్లో రైతులతో రైతు క్లబ్‌లను ఏర్పాటు చేసి, వారికున్న భూమిలో కొంత ప్రకృతి వ్యవసాయం చేయడాన్ని ప్రోత్సహించాలన్నారు. రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు అందించడానికి తాము సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ సమావేశంలో డ్వాక్రా సీసీలు జి.రేఖ, ఎం.హేమ, మండల మహిళా సమాఖ్య కార్యదర్శి దారపురెడ్డి శేషారత్నం, సంయుక్త కార్యదర్శి ఇలపర్తి రమణ, వీవోఏఎస్‌లు, వీవోలు పాల్గొన్నారు.

నేటి నుంచి జట్లపాలెంలో సువార్త సభలు

పెంటపాడు: ఈనెల 4 నుంచి మూడు రోజుల పాటు జట్లపాలెం గ్రామంలో 22వ వార్షిక క్రీస్తు సువార్త స్వస్థత సభలు నిర్వహించనున్నట్లు పడాలకు చెందిన వాక్యజ్యోతి మినిస్ట్రీస్ వ్యవస్థాపకురాలు, ప్రవక్తిని కొమ్మిశెట్టి అమ్మాజీ పేర్కొన్నారు. ఈ సభల్లో రంగారెడ్డి జిల్లాకు చెందిన సాయిలన్న, పాస్టర్లు ఘనరాజు, జాజిరాజులు పాల్గొంటారన్నారు. పరిసర గ్రామాల ప్రజలు ఈ సభలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ద్వితీయ సంవత్సరం ఇంటర్ పరీక్షలు పట్టణంలోను, పెంటపాడులోను శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించారు. వాసవి, జీఎంఆర్, ఆదిత్య, ప్రగతి, గోయెంకా ఉమన్స్, పెంటపాడు జూనియర్ కళాశాలలో రెండో సంవత్సరం తెలుగు, హిందీ, సంస్కృతం పరీక్షలు జరిగాయి. 1,815 మంది పరీక్షలకు హాజరుకావాల్సి ఉండగా 1,786 మంది పరీక్షలు రాశారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి



తణుకు: అవగాహనా ర్యాలీ చేస్తున్న ఐకేపీ, డ్వాక్రా సంఘాల సభ్యులు



పెంటపాడు: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ చేస్తున్న దృశ్యం

తణుకు టౌన్: ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఐకేపీ ఏపీఎం ఏ రామకష్ణ తెలిపారు. శనివారం తణుకు మహిళా మండల సమాఖ్య ఆధ్వర్యంలో స్వీప్‌పై నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈసందర్భంగా డ్వాక్రా సంఘాల సభ్యులందరికీ ఓటు వినియోగంపై అవగాహన కల్పించారు. అదే విధంగా పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో ఐకేపీ, డ్వాక్రా సిబ్బంది, డ్వాక్రాసంఘాల నాయకులు, మండల సమాఖ్య సభ్యులు, డీఆర్‌డీఏ సభ్యులు, ఏపీసీఎన్‌ఎఫ్ సిబ్బంది, పాల్గొన్నారు.

ఓటు బలమైన ఆయుధం

పెంటపాడు: ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతు సాధికారతను సాధించేందుకు డ్వాక్రా సభ్యులు గ్రామాల్లో ప్రముఖ పాత్ర పోషించాలని ఐకేపీ ఏపీఎం అహ్మద్ పేర్కొన్నారు. శనివారం పెంటపాడు మండల సమాఖ్య కార్యాలయం వద్ద మండల సమాఖ్య అధ్యక్షురాలు దాసరి ప్రవీణ అధ్యక్షతన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం అహ్మద్ మాట్లాడుతూ ఓటు సామాన్యుని చేతిలో బలమైన ఆయుధమని, ఓటు ద్వారా నిజాయతీ పరులను ఎన్నుకోవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా ఓటర్లకు అవగాహన కోసం ర్యాలీ, మానవహారం నిర్వహించారు. డ్వాక్రా సీసీలు లక్ష్మి, సుజాత, సూరిబాబు పాల్గొన్నారు.